సాక్షి
కాకినాడ
సోమవారం । 7 । ఆగస్టు । 2023



వీడిన స్నేహబంధం

కొద్ది గంటల్లో స్నేహితుల దినోత్సవం ప్రారంభమవుతుందనుకున్న సమయంలో జరిగిన కారు ప్రమాదంలో ముగ్గురు మిత్రులు మృత్యువాత పడటం విషాదాన్ని నింపింది. - 8లో



రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన భవన నిర్మాణానికి పండ్రంగి ఫణిశ్రీకాంత్, భారతీ ప్రపూర్ణ దంపతులు (కాలిఫోర్నియా, అమెరికా) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

డెల్టాలకు 14,900 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు ఆదివారం 14,900 క్యూసెక్కుల గోదావరి జలాలను విడుదల చేశారు. తూర్పు 4,900, సెంట్రల్ 2,500, పశ్చిమ డెల్టాకు 7,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. 2,08,064 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా త్రినాథరావు



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

కాకినాడ సిటీ: జిల్లా రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా పిఠాపురం తహసీల్దార్ పితాని త్రినాథరావు ఎన్నికయ్యారు. కలెక్టరేట్ సమీపంలోని రెవెన్యూ భవన్‌లో సంఘం జిల్లా ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్ వ్యవహరించారు. ఒక్కో కేటగిరీకి ఒక్కో నామినేషనే దాఖలైంది. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైందని ఎన్నికల అధికారి శ్రీనివాస్ ప్రకటించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా తొండంగి తహసీల్దార్ జి.బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా జేవీఆర్ రమేష్, పి.సుబ్బారావు, కేవీఎస్ సుబ్బారావు, వి.భారతి; ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పీవీ సీతాపతిరావు; స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా ఎం.శివకుమార్ నాయుడు; సంయుక్త కార్యదర్శులుగా ఎస్.పోతురాజు, వి.వెంకటేశ్వరరావు, కె.మనోహర్, వి.గోపి; కోశాధికారిగా ఎస్.రామ్మోహన్; కార్యనిర్వాహక కార్యదర్శులుగా పి సత్యశ్రీకాంత్, వై.యమున సత్యనాగినిదేవి, ఎ.రామకృష్ణ, ఎస్ఆర్ఆర్ చంద్రశేఖర్, డి.దుర్గాప్రసాద్, ఎస్.చినపాపారావు, కె.గోవిందరాజులు; రాష్ట్ర కౌన్సిలర్లుగా వీరవల్లి మురార్జీ, ఎం.సత్యనారాయణ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులతో ఎన్నికల అధికారి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆచంట రామానాయుడు, బూరిగ ఆశీర్వాదం, రాష్ట్ర ప్రభుత్వం డ్రైవర్స్ ఉద్యోగుల సంఘ ఉపాధ్యక్షులు సంసాని శ్రీనివాసరావు, ఏపీ ఎన్జీవోల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, కో ఆపరేటివ్ ఉద్యోగ సంఘ నాయకులు దుర్గాప్రసాద్, చింతలపల్లి ఉదయభాస్కర్ తదితరులను సత్కరించారు.

నేడు స్పందన

కాకినాడ సిటీ: జగనన్నకు చెబుదాం.. జిల్లా స్థాయి స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నారు. కలెక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. అలాగే డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకూ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజలు 1800 425 3077 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తనకు నేరుగా తమ సమస్యలు తెలియజేయవచ్చని తెలిపారు.

లోవలో భక్తుల సందడి

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు ఆదివారం వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో సందడి నెలకొంది. అమ్మవారిని 35 వేల మంది దర్శించుకున్నట్టు కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.2,61,780, పూజా టికెట్లకు రూ.3,00,510, కేశఖండన శాలకు రూ.22,280, వాహన పూజలకు రూ.5,450, కాటేజీలు, పొంగలి షెడ్లు, గదుల అద్దెలుగా రూ.1,04,382, విరాళాలుగా రూ.1,91,598 కలిపి మొత్తం రూ.8,86.000 ఆదాయం సమకూరిందని వివరించారు. భక్తులు క్యూలైన్లలో వేచి ఉండి మరీ అమ్మవారిని దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు వాహనాల్లో తరలి రావడంతో ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించిపోయింది. వాహనదారులే స్వయంగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించుకున్నారు. వసతి గదులు లభించని భక్తులు దేవస్థానం ప్రాంగణం, కొండ దిగువన తోటల్లో వసతి ఏర్పాటు చేసుకుని, వంటలు, భోజనాలు చేశారు.

తమ్ముళ్లు.. కుమ్ముళ్లు

- ప్రత్తిపాడులో టీడీపీ వర్గవిభేదాలు
- సత్యప్రభకు వ్యతిరేకంగా అసమ్మతి రాజకీయాలు
- పెంచి పోషిస్తోన్న పెద్దలు
- ఒకవైపు యనమల, వర్మ
- మరోవైపు జ్యోతుల వర్గం



ఇటీవల యనమల రామకృష్ణుడిని కలిసిన సత్యప్రభ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కలసి ఉన్నట్టే కనిపించిన తమ్ముళ్లు ఒక్కసారిగా కత్తులు దూస్తున్నారు.. పార్టీపై పెత్తనం కోసం మూడు గ్రూపులు.. ఆరు ముఠాలు అన్నట్టు కాలు దువ్వుతున్నారు.. సరి చేయాల్సిన జిల్లా నేతలు సైతం అసమ్మతి కుంపట్లను మరింతగా రాజేస్తున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో టీడీపీ నేతల మధ్య ఆధిపత్య పోరు ముదిరిపాకాన పడింది. నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల రాజా హఠాన్మరణం తరువాత ఆయన భార్య సత్యప్రభను ఆ స్థానంలో నియమించారు. ఆ బాధ్యతలు తీసుకున్న సత్యప్రభ నియోజకవర్గ పర్యటనలకు శ్రీకారం చుట్టారు. మొదట్లో నేతలంతా కలసి ఉన్నట్టే పైకి కనిపించారు. రెండు నెలలు గడిచేసరికి గతంలో రాజాపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన నేతలు.. ఇప్పుడు సత్యప్రభ లక్ష్యంగా అసమ్మతి రాగం ఆలపిస్తున్నారు. పార్టీలో ఆమెను ఏకాకిని చేయడం ద్వారా పొమ్మనకుండానే పొగబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయనే చర్చ జరుగుతోంది. బొత్తిగా కొత్త అయిన సత్యప్రభ ఈ రాజకీయాలకు బెదిరిపోయి తనంత తానే తప్పుకుంటారనే ఉద్దేశంతోనే వ్యూహాత్మకంగా అసమ్మతి రాజేస్తున్నారని పార్టీలో మొదటి నుంచి ఉన్న నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ రాజకీయాలు ఇలానే కొనసాగితే ఇన్‌చార్జి పదవి నుంచి వైదొలగడమే పరిష్కారమనే భావన ఆమెకు కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం జరుగుతోంది.

రాజా మరణానికి ముందు నుంచే..

వరుపుల రాజా హఠాన్మరణానికి ఏడాది ముందు నుంచే పైలా బోస్ వర్గం ఆయనపై అసమ్మతి వెళ్లగక్కుతూ వచ్చింది. ఇన్‌చార్జిగా రాజాను తొలగించాలంటూ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బోస్ వర్గం హోర్డింగ్‌లు పెట్టింది. దీనిపై ఇరు వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే నాడు భగ్గుమనే పరిస్థితి ఏర్పడింది. రాజాను తొలగించాలని ధర్నా చేయడం, పార్టీలో కొందరు పెద్దలు తెర వెనుక ఉండి అసంతృప్తిని ఎగదోయడంతో రాజా మానసిక వేదనకు గురై హఠాన్మరణం చెందారనే చర్చ అప్పట్లో పార్టీ వర్గాల్లో జరిగింది. రాజా మరణానంతరం ఆయన భార్య సత్యప్రభకు ఇన్‌చార్జి పదవి ఇవ్వడాన్ని అసమ్మతి వర్గం ఏ కోశానా ఆమోదించడం లేదు. సరికదా బహిరంగంగానే వ్యతిరేకిస్తున్నాయి.

ఆమె వల్ల కాదంటూ..

- రాజకీయాలకు కొత్త.. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్న సత్యప్రభతో పార్టీని నడిపించడం సాధ్యం కాదనే వాదనను ఆమె వ్యతిరేక వర్గాలు తెర మీదకు బలంగా తీసుకువస్తున్నాయి. ఇదే వాదనను వారు పార్టీ ముఖ్య నేతలకు వినిపించారని సమాచారం. ఆమెను తప్పించి అన్ని విధాలా సమర్థులైన వారికి పార్టీ బాధ్యతలు అప్పగించాలని వ్యతిరేక వర్గం గట్టి పట్టుదలతో ఉంది. దీని వెనుక పార్టీ ముఖ్యులు న్నారనే ప్రచారం ఉంది.
- ఇటీవల ఏలేశ్వరంలో రాజా వర్గానికి చెందిన పలివెల శ్రీనుపై బోస్ వర్గీయులు చేయి చేసుకున్న వ్యవహారం పోలీసు స్టేషన్ వరకూ వెళ్లింది. రౌతులపూడి మండలం జెడ్పీటీసీకి పోటీ చేసి, ఓటమి పాలైన గంటా గోపి.. అదే మండలానికి చెందిన టీడీపీ నాయకుడు, రాజా వర్గీయుడైన సోమరౌతు చంద్రమౌళిని బహిరంగంగానే చెప్పుతో కొట్టారు. చంద్రమౌళిని జ్యోతుల నవీన్, సత్యప్రభ పరామర్శించారు.
- గోపీని సస్పెండ్ చేయాలని మౌళి సహా రాజా వర్గీయులు పలువురు పట్టుబట్టినా యనమల వర్గం అడ్డుపడిందని అంటున్నారు.
- తనను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవడంలో విఫలమైన సత్యప్రభపై చంద్రమౌళి వర్గీయులు అసంతృప్తితో రగిలిపోతున్నారు.
- శంఖవరం మండలంలో కొంతమంది నాయకులు యనమల కృష్ణుడికి మద్దతుగా ఉంటూ వ్యతిరేక ప్రచారం చేస్తూండటం సత్యప్రభకు తలనొప్పిగా మారింది.
- యనమల వర్గంగా ముద్రపడిన టీడీపీ శంఖవరం మండల అధ్యక్షుడు బద్ది రామారావు తమ వారిని దూరం పెడుతున్నారని సత్యప్రభ వర్గం కారాలూ మిరియాలూ నూరుతోంది. ఆమెకు వ్యతిరేకంగా ముదునూరి మురళీకృష్ణంరాజు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వెనుక రామారావు పాత్ర ఉందని అగ్గిమీద గుగ్గిలమవుతోంది. ఇదంతా యనమలకు తెలిసే జరుగుతోందని అంటున్నారు.
- ఏలేశ్వరంలో పార్టీ ఉనికి కోల్పోవడానికి పైల బోస్ తీరే కారణమంటూ సత్యప్రభ ఆ వర్గాన్ని దూరం పెట్టింది. దీంతో ఇరు వర్గాల మధ్య వైషమ్యాలు తారస్థాయికి చేరాయి.
- సొంత నియోజకవర్గాల్లో చేతులెత్తేసిన యనమల రామకృష్ణుడు (తుని), ఎస్‌వీఎస్ఎన్ వర్మ (పిఠాపురం) ప్రత్తిపాడులో వేలు పెట్టి టీడీపీలో వర్గ విభేదాలకు కారకులవుతున్నారని సత్యప్రభ వర్గీయులు మండిపడుతున్నారు.
- సత్యప్రభ ప్రాతినిధ్యం విషయంలో ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ సానుకూలంగా ఉండటం యనమల, వర్మ వర్గీయులకు రుచించడం లేదు. నెహ్రూ, యనమల మధ్య పార్టీ ఆవిర్భావం నుంచీ విభేదాలు ఉన్న విషయం అందరికీ తెలిసిందే.
- పిఠాపురం సీటును ఈసారి నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న సామాజికవర్గానికి ఇవ్వాలనే వాదనను జ్యోతుల నవీన్ తెర మీదకు తీసుకువచ్చారు. అప్పటి నుంచీ మాజీ ఎమ్మెల్యే వర్మతో విభేదాలు పొడచూపాయి. ఇందుకు ప్రతిగా కాకినాడ పార్లమెంట్ స్థానంపై నవీన్ పెట్టుకున్న ఆశలపై యనమల సాయంతో నీళ్లు చల్లేందుకు వర్మ ప్రయత్నాలు చేశారు. అప్పటి నుంచీ వర్మను జ్యోతుల వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇన్ని విభేదాల మధ్య చివరి వరకూ సత్యప్రభ ఇన్‌చార్జిగా కొనసాగుతారా లేక మధ్యలోనే కాడి వదిలేస్తారా అనేది వేచి చూడాల్సిందే.

సై అంటున్న మరో వర్గం

ఇదిలా ఉండగా ఇటీవలే సైకిల్ ఎక్కిన ముదునూరి మురళీకృష్ణంరాజు మరో వర్గంగా అసమ్మతి కార్యకలాపాలకు సై అంటున్నారు. శంఖవరం మండలం అన్నవరం సహా ప్రత్తిపాడు తదితర ప్రాంతాల్లో వ్యక్తిగతంగా మురళీకృష్ణంరాజు ఫొటోలతో ఫ్లెక్సీలు ప్రత్యక్షమవడాన్ని రాజా వర్గీయులు వ్యతిరేకిస్తున్నారు. కార్యకర్తల్లో అయోమయం సృష్టించేందుకు కావాలనే ఇలా వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని ఈ వర్గం అగ్గిమీద గుగ్గిలమవుతోంది. విభేదాల నేపథ్యంలో సత్యప్రభ ఇటీవల మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిని, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పను కలిశారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



సామర్లకోట జగనన్న కాలనీని పరిశీలించిన తలశిల రఘురాం తదితరులు

సామర్లకోట: స్థానిక జగనన్న కాలనీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోగ్రాం కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కాలనీలో తాగునీరు, విద్యుత్ సదుపాయంతో పాటు రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు పూర్తి చేయాలని రఘురాం ఆదేశించారు. సభా ప్రాంగణమైన ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ, సామర్లకోట - పెద్దాపురం రోడ్డులో హెలిపాడ్‌లను పరిశీలించారు. జగనన్న కాలనీ పర్యటన, సభా ప్రాంగణాలకు చేరుకోవడానికి వీలుగా హెలిపాడ్ ఉండాలని సూచించారు. ఈ నేపథ్యంలో హెలిపాడ్ ఏర్పాటుకు జగనన్న కాలనీ సమీపాన ఉన్న ఖాళీ భూములను పరిశీలించారు. హెలిపాడ్ నుంచి జగనన్న కాలనీ వరకూ రోడ్డు నిర్మించాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. జగనన్న కాలనీలో ప్రతి ఒక్కరూ ఇళ్లు నిర్మించుకునేలా లబ్ధిదారులను చైతన్యపరచాలని చెప్పారు. నియోజకవర్గంలో జరిగే సామూహిక గృహ ప్రవేశాల్లో సీఎం జగన్ పాల్గొంటారని రఘురాం తెలిపారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో వేగంగా పనులు పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ అనుబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, డీఆర్‌ఓ ఎస్.సత్యనారాయణ, హౌసింగ్ పీడీ పట్నాయక్, డీఈ రాజు, పెద్దాపురం, కాకినాడ ఆర్‌డీఓలు జె.సీతారామారావు, వెంకటరమణ, తహసీల్దార్లు వజ్రపు జితేంద్ర, ఎస్ఎల్‌వీ కుమారి, ఎంపీడీఓ డి.శ్రీలలిత, డీఎల్‌పీఓ ప్రసాద్, డీఎల్‌డీఓ పి.నారాయణమూర్తి, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే జోన్ ఏర్పాటులో జాప్యం ఎందుకు?

తుని: విభజన చట్టంలో పొందుపరచిన విశాఖ రైల్వే జోన్ ఏర్పాటులో ఎందుకు జాప్యం చేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రశ్నించారు. తుని రైల్వే స్టేషన్‌లో జరిగిన అమృత్ భారత్ పథకం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. పైలాన్‌ను ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమానికి హాజరయ్యానని చెప్పారు. రైల్వే స్టేషన్ల ఆధునీకరణను స్వాగతిస్తున్నామని చెప్పారు. ఏపీకి అగ్రస్థానం కల్పించిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తే ఉత్తరాంధ్రతో పాటు కోస్తా జిల్లాలు అభివృద్ధి చెందుతాయని, యువతకు పుష్కలంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు.

ఇప్పటికైనా రాష్ట్ర ప్రజల కోరికను ప్రధాని నెరవేర్చాలని మంత్రి కోరారు. ఈ సందర్భంగా రైల్వే శాఖ విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేటుకూరి సూర్యనారాయణరాజు, జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, రైల్వే నోడల్ అధికారి మునిరెడ్డి, ఆర్‌డీఓ సీతారామారావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు తదితరులు పాల్గొన్నారు.

అమృత్ భారత్‌తో మహర్దశ

- కాకినాడ టౌన్, తుని రైల్వే స్టేషన్ల అభివృద్ధికి శ్రీకారం
- పాల్గొన్న మంత్రులు చెల్లుబోయిన వేణు, కొట్టు సత్యనారాయణ, ఎంపీలు, ఎమ్మెల్యేలు



కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేణు, ఎంపీలు వంగా గీత, బోస్, ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కన్నబాబు తదితరులు



తుని రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

కాకినాడ: అమృత్ భారత్ పథకానికి ఎంపికైన రైల్వే స్టేషన్లకు మహర్దశ పట్టనుందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అన్నారు. అమృత్ భారత్ ద్వారా దేశంలోని 508 రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ పథకానికి జిల్లాలోని కాకినాడ టౌన్, తుని రైల్వే స్టేషన్లు ఎంపికైన విషయం తెలిసిందే. ప్రధాని పాల్గొన్న కార్యక్రమాన్ని కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ నుంచి మంత్రి వేణు వీక్షించి, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతానికి అనేక ప్రాజెక్టులు సాధించేందుకు ఎంపీ వంగా గీత నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ ప్రధాని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్నేహపూర్వక వాతావరణంలో పని చేస్తూండటంతో అభివృద్ధికి మార్గం సుగమమవుతోందని చెప్పారు. ఎంపీ గీత మాట్లాడుతూ వందేభారత్‌కు సామర్లకోటలో హాల్ట్ నుంచి మరెన్నో ప్రాజెక్టులను సాధించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు ఎంతో తోడ్పాటునిస్తున్నారని అన్నారు. వీరి సహకారం వల్లే ఈఎస్ఐ ఆస్పత్రి, కేంద్రీయ విద్యాలయం, ఆయుష్ కేంద్రం, ఐఐఎఫ్‌టీ వంటివి సాధించగలిగామన్నారు. ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు మాట్లాడుతూ, ఎంపీ గీత అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారని కొనియాడారు. ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైల్వే స్టేషన్ల ఆధునీకరణతో పాటు ఇటీవల జరిగిన అతి పెద్ద రైల్వే ప్రమాదాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కాకినాడ నగరాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, జెడ్ఆర్‌యూసీసీ, డీఆర్‌యూసీసీ సభ్యులు వైపీ రామారావు, అద్దూరి ఫణీష్, రాష్ట్ర రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, బీజేపీ నేతలు కర్రి చిట్టిబాబు, చిలుకూరి రామ్‌కుమార్, వై.మాలకొండయ్య, రైల్వే నోడల్ అధికారి ఐఆర్ఎస్ఈ రవి షమ్మీకుమార్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, స్టేషన్ మేనేజర్ కె.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు బహుమతులు ప్రదానం చేశారు.

'చీర'కాలం గుర్తుండేలా..

- చేయి తిరిగిన నేతన్నకు ప్రభుత్వం చేయూత
- వస్త్ర సోయగాలకు సుస్థిర స్థానం కల్పిస్తున్న కళాకారులు
- నేడు జాతీయ చేనేత దినోత్సవం



ఉప్పాడ జాంధానీ చీర



జాంధానీ చీరలు నేస్తున్న కార్మికుడు

పిఠాపురం: భారత స్వాతంత్ర్యోద్యమంలో విదేశీ వస్తు బహిష్కరణ కీలక ఘట్టం. ఆ క్రమంలోనే గాంధీజీ ఖద్దరు వాడకానికి పిలుపునిచ్చారు. ఆ స్ఫూర్తితో మొదలైన చేనేత పరిశ్రమ కాలానుగుణంగా రకరకాల మార్పులు చెందుతూ ప్రజాదరణ పొందుతోంది. చేనేత కార్మికుల రెక్కల కష్టానికి, ప్రతిభకు ఒక గుర్తింపు ఇచ్చేలా ఏటా ఆగస్టు 6వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో చేనేత కార్మికులు.. తమ కళానైపుణ్యంతో రకరకాల వస్త్రాలు నేస్తూ ప్రజలను, ముఖ్యంగా మహిళలను ఆకట్టుకుంటున్నారు. ఉప్పాడ కాటన్, సిల్క్ గతంలో పేటెంట్ హక్కు పొందాయి. ఇండియన్ హ్యాండ్‌లూమ్స్‌లో స్థానం సంపాదించాయి. ప్రభుత్వ చేయూతతో కుటీర పరిశ్రమగా ప్రారంభమైన ఉప్పాడ జాంధానీ చీరల తయారీ నేడు ప్రపంచస్థాయి గుర్తింపు పొందింది. ఏటా రూ.కోట్ల విలువైన జాంధానీ చీరల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ఈ చీరల డిజైన్లతో తపాలా శాఖ ప్రత్యేకంగా పోస్టల్ కవర్ విడుదల చేసింది. దీంతోపాటు అరటి నారతో అందాల వస్త్రాలు నేయడంలో శిక్షణ ఇస్తూ మరో అరుదైన ఘనతను ఉప్పాడ చేనేత కళాకారులు సొంతం చేసుకున్నారు. రెండువైపులా ఒకేలా కనిపించే జాంధానీ చీరలకు రానురానూ గిరాకీ పెరుగుతోంది. ఒక్క యు.కొత్తపల్లి మండలంలోనే కొత్తపల్లి, కుతుకుడుమల్లి, వాకతిప్ప, అమీనాబాద్, ఉప్పాడ, మూలపేట తదితర గ్రామాల్లో గతంలో 50 వరకూ ఉండే మగ్గాలు నేడు 500 వరకూ చేరాయంటే.. చేనేత ఈ ప్రాంతంలో ఎంతగా పరిఢవిల్లుతోందో అర్థం చేసుకోవచ్చు. అన్ని కులాల వారు, చిన్న పిల్లలు సైతం జాంధానీ చీరలు తయారుచేస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ..	
చేనేత కుటుంబాలు:	26,000
మగ్గాలు:	12,000
చేనేత కార్మికులు:	1,20,000

జాంధానీ చీరలు ఎంతో బాగుంటాయి



నేత చీరల్లో ఉన్న సౌఖ్యం మరి దేనిలోనూ ఉండదు. అందులోనూ జాంధానీ చీరలు మరింత బాగుంటాయి. అందుకే ఎంత ఖరీదైనా వీటినే కొనుగోలు చేస్తాం.

– సత్యవతి, కాకినాడ

జాంధానీదే మొదటి స్థానం



చదువులో భాగంగా మాకు చేనేత వస్త్రాల తయారీపై అవగాహన కల్పించారు. ఉప్పాడ జాంధానీ చీరల తయారీ చాలా భిన్నంగా ఉంది. ఇక్కడి కార్మికులు యంత్రాలకు దీటుగా ఎన్నో డిజైన్లు చాకచక్యంగా నేస్తున్నారు. ఎన్ని రకాల కొత్త ఫ్యాషన్లు అందుబాటులోకి వచ్చినా ఉప్పాడ జాంధానీ చీరలను దాటి వెళ్లలేవు. మేం చూసిన వాటిలో వీటిదే మొదటి స్థానం.

– జాహ్నవి, స్టూడెంట్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్), హైదరాబాద్

అంతా చేనేతే..

గతంలో నేత పని అంతంత మాత్రంగానే ఉండేది. ఇప్పుడు చేతి నిండా ఉంటోంది. ఎంత కళాత్మకమైన పనయినా చేతితోనే నేస్తాం. చీరలో వాడే ముడి సరకు నుంచి తయరు చేసే కార్మికుడి వరకూ అందరూ కళానైపుణ్యంతో పాటు నాణ్యతకు పెద్ద పీట వేస్తారు. జాంధానీకి వెండి కోటింగ్ ఉంటుంది. దీనిలో తల వెంట్రుక మందంలో ఎరుపు రంగు పట్టుదారం వుంటుంది. నాణ్యమైన జరీదారం ముడుచుకుపోయే గుణం కలిగి ఉంటుంది. ప్రతి జాంధానీ చీర నేతకు ముగ్గురి నుంచి నలుగురు కార్మికులు అవసరం అవుతారు. డిజైన్‌ను బట్టి ఒక్కో చీర నేతకు 20 నుంచి 40 రోజుల వరకూ పడుతుంది.

– తాతోలు దేవి, నేత కార్మికురాలు ఉప్పాడ

క్లుప్తంగా

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ


దుబాయిలో స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యుల నుంచి గోల్డ్ మెడల్ అందుకుంటున్న వీరబాబు

జగ్గంపేట: దుబాయిలో జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జగ్గంపేట యువకుడు బుర్ర శివసాయి వీరబాబు బంగారు పతకం సాధించాడు. దీనిపై ఆదివారం స్థానికంగా హనుమాన్ పవర్ జిమ్ కోచ్ కన్నారావు మాట్లాడుతూ దుబాయిలో ఈ నెల 1 నుంచి 6 వరకూ వివిధ విభాగాల్లో పవర్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయన్నారు. ఇందులో వీరబాబు 74 కిలోల విభాగంలో 495 కిలోలు లిఫ్ట్ చేసి ప్రథమ స్థానం సాధించాడని వివరించారు. ప్రథమ, ద్వితీయ స్థానాలను భారతదేశానికి చెందిన వారే కైవసం చేసుకున్నారని తెలిపారు. గత మే నెలలో జాతీయ స్థాయిలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో వీరబాబు ప్రతిభ చాటి గోల్డ్ మెడల్ సాధించి, దుబాయిలో జరిగిన పోటీలకు ఎంపికయ్యాడని అన్నారు. ఆది వారం అక్కడ జరిగిన పోటీల్లోనూ తన సత్తా చాటాడన్నారు. గవర్నమెంట్ ఆఫ్ దుబాయి, దుబాయి స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఎస్‌బీకేఎఫ్ (సంయుక్త భారతీయ కేల్ ఫౌండేషన్), ఐఎస్ఓ (ఇందుశ్రీ ఆర్గనైజేషన్) ఈ పోటీలు నిర్వహించాయని చెప్పారు. అంతర్జాతీయ పోటీల్లో రాణించిన వీరబాబును కోచ్ కన్నారావు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

సెంట్రల్ జైలు ఖైదీ పరారీ

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు ఖైదీ పరారయ్యాడు. శనివారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. చాగల్లుకు చెందిన గండికోట బాలకృష్ణ (30) ఓ కిడ్నాప్ కేసులో నేరం రుజువు కావడంతో గత నెల 17వ తేదీ నుంచి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు. కొద్ది రోజుల కిందట అనారోగ్యానికి గురైతే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి జైలు అధికారులు తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు సిఫార్సు చేశారు. జీజీహెచ్‌లో చేరిన బాలకృష్ణ ఎం–4 మెడికల్ వార్డులో ఉంటూ చికిత్స పొందుతున్నాడు. బాలకృష్ణకు నిరంజన్ బాబు, శ్రీహరి బాబు అనే ఇద్దరు పోలీసులు ఎస్కార్ట్‌గా వ్యవహరిస్తున్నారు. శనివారం రాత్రి మూత్రానికి వెళతానని చెప్పిన బాలకృష్ణ ఎస్కార్ట్ కళ్లుగప్పి అక్కడి బాత్రూంలోని వెళ్లి కిటికీ ఊచలు వంచి అక్కడి నుంచి తప్పించుకున్నాడు. కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. 2021లో కూడా ఓ నేరంలో అరెస్టు అయ్యి శిక్ష అనుభవిస్తూ అనారోగ్యంతో జీజీహెచ్‌లో చేరి అప్పటి ఎస్కార్ట్ కళ్లుగప్పి పారిపోయినట్టు పోలీసులు తెలిపారు.

వీడిన స్నేహబంధం

- స్నేహితుల దినోత్సవ సంబరాల్లో విషాదం
- పంట కాలువలో పడిన కారు
- ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థుల మృతి
- రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి వద్ద బంధువుల రోదనలు


అయ్యన్న గళ్లు కాలువ నుంచి మృతదేహాలను వెలికితీస్తున్న పోలీసులు

మధురపూడి/కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అందరూ కలిశారు.. మదిలో మధుర స్మృతులతో స్నేహితుల దినోత్సవం ముందు రోజు ఆనంద సాగరంలో మునిగి తేలారు. మది నిండా మధురానుభూతులతో గడిపారు.. ఆనందాల జడిలో తడిసి ముద్దయ్యి తిరుగు పయనమయ్యారు. ఇంతలోనే అనుకోని ప్రమాదం ఆ స్నేహ బంధాన్ని చిన్నాభిన్నం చేసింది.. ఆ ఆనందం కాస్తా ఆవిరయ్యింది.. స్నేహితుల దినోత్సవం ముందు రోజు జరిగిన ఈ దుర్ఘటన అందరినీ కలచివేసింది.. అవే చివరి చూపులని తెలియని మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.. కారు పంట కాలువలోకి దూసుకువెళ్లిన ప్రమాదంలో ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులు దుర్మరణం పాలైన ఘటన కోరుకొండ మండలం బూరుగుపూడి వద్ద శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది.

అసలేం జరిగిందంటే..

ఏలూరు రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో దూడే హర్షవర్ధన్ (19), తెల్లా హేమంత్ కుమార్ (19), కవిటి ఉదయ్‌కిరణ్ (20), వేమూరి వంశీ, కరుకూరి హేమంత్, పలివెల ప్రణీత్‌లు బీటెక్ విద్య మూడో సంవత్సరం చదువుతున్నారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు కార్లలో పది మంది విద్యార్థులు అల్లూరు సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మీదుగా గుడిసె పర్యాటక ప్రాంతానికి బయలు దేరారు. మొదటి కారులో పై ఆరుగురూ ఉన్నారు. అక్కడ ఉల్లాసంగా గడిపారు. స్నేహితులంతా కలసి ఆనందాన్ని పంచుకున్నారు. తిరుగు పయనంలో వారు శనివారం అర్ధరాత్రి తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం బూరుగుపూడి సమీపాన ఉన్న అయ్యగళ్ల కాలువ వద్దకు వచ్చేసరికి రోడ్డు మలుపులో కారు బ్రేక్ ఫెయిల్ అయ్యి 15 అడుగుల లోతున ఉన్న కాలువలోకి దూసుకు పోయింది. కారు అక్కడి పాత వంతెనను ఢీకొట్టి, పైకి ఎగిరి కాలువలో పడింది. ఈ ప్రమాదంలో వెనుక సీట్లో కూర్చున్న ముగ్గురు విద్యార్థులు హర్షవర్ధన్, టి.హేమంత్, ఉదయ్‌కిరణ్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. కారు ముందు సీట్లో కూర్చున్న ముగ్గురు విద్యార్థులూ ప్రాణాలతో బయటపడ్డారు. ముందు డోర్ నుంచి తంగెళ్లమూడి గ్రామానికి చెందిన వంశీ, పెరవలి మండలం నడిపల్లికోటకు చెందిన కరుకూరి హేమంత్, ఏలూరుకు చెందిన పలివెల ప్రణీత్‌లు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు ఆదివారం ఉదయం మృతదేహాలను బయటకు తీశారు.


గాయపడిన ప్రణీత్

ఎక్కడి వారంటే..

ప్రమాదంలో గాయపడిన వారిని, ముగ్గురి మృతదేహాలను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి ఆదివారం తీసుకొచ్చారు. గాయపడిన పి.ప్రణీత్, కె.హేమంత్, వి.వంశీలకు వైద్యులు మెరుగైన చికిత్స అందించారు. కారు నడుపుతున్న ప్రణీత్ చేయి విరిగిపోగా చికిత్స చేశారు. సీటు బెల్ట్ పెట్టుకోవడంతో ప్రణీత్ ప్రాణాలతో బయటపడ్డాడు. విద్యార్థుల కుటుంబీకులు ఆసుపత్రి వద్దకు చేరుకోవడంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ప్రమాదంలో మృతిచెందిన వారు ఏలూరు జిల్లా పెదపాడుకు చెందిన వీరేంద్రనాయుడు కుమారుడైన హర్షవర్ధన్, ఏలూరుకు చెందిన ఆనంద్ కుమారుడు తెల్లా హేమంత్ కుమార్, ఉమామహేశ్వరం గ్రామానికి చెందిన గోవిందరావు కుమారుడు కవిటి ఉదయ్‌కిరణ్ (20)గా గుర్తించారు. కష్టపడి చదువుకుని కుటుంబానికి ఆసరాగా నిలుస్తారనుకున్నామని, ఇంతలోనే అనుకోని ప్రమాదం తమ ఆశలను చిదిమివేసిందని ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యులు పెద్దపెట్టున రోదించారు. ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థుల మృతదేహాలకు ప్రభుత్వాసుపత్రిలో పోస్టు మార్టం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కోరుకొండ సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్సై శారదా సతీష్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


హర్షవర్ధన్ మృతదేహం


మృతుడు హేమంత్ కుమార్


గాయపడిన కె.హేమంత్, వి.వంశీ

వ్యక్తి మృతి

మండపేట: కపిలేశ్వరపురం మండలం కాలేరుకు చెందిన వ్యక్తి అనుమానాస్పద మృతిపై ఆదివారం రాత్రి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం ప్రకారం.. శనివారం సాయంత్రం స్థానిక విజయలక్ష్మీ నగర్‌లోని లారీ షెడ్డు వద్ద కాలేరుకు చెందిన పి.అనిల్‌కుమార్ నోటి నుంచి నురగలు కక్కుతూ ఉన్నాడు. షెడ్డు యజమాని కె.శ్రీనివాస్ గమనించి లోవరాజు అనే వ్యక్తి సాయంతో అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడి కాలిపై పాము కరిచిన గుర్తు ఉందని శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎం.అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై పోక్సో కేసు

యానాం: స్థానికంగా ఓ బాలికను ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసగించిన యువకుడు కె.లోకేష్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఆదివారం సీఐ షణ్ముగం, ఎస్సై శేరు నూకరాజు తెలిపారు. 16 ఏళ్ల బాలికను ప్రేమిస్తున్నానని లోబర్చుకుని, మైనారిటీ తీరిన తర్వాత పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు బాలిక తెలపడంతో వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వివరించారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

సీతానగరం: వంగలపూడికి చెందిన వాసు (35) పురుగు మందు తాగి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై కె.చిరంజీవి కథనం ప్రకారం.. మద్యానికి బానిసైన వాసును ఇంటి వద్ద ఏమీ పట్టించుకోవడం లేదని భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన వాసు ఇంటి వద్ద ఉన్న పురుగు మందు తాగాడు. వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ఈ పాపం ఎవరిదో!

రోడ్డుపై వదిలేసిన వైనం

అనపర్తి: ఈ పాపం ఎవరిదో.. ఏమైందో ఏమో.. ఓ పసిప్రాయం కనులు తెరవకుండానే రోడ్డు పాలైంది. కన్న తల్లి వెచ్చని పొత్తిళ్ల చెంత ఉండాల్సిన ఆ పసివాడిని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డుపై వదిలేసిన ఘటన అనపర్తిలో ఆదివారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. అనపర్తి పాత ఊరు బాపనమ్మ గుడి ప్రాంతంలో ఒక పాత పెంకుటిల్లు బయట మధ్యాహ్నం 12 గంటల సమయంలో మగ శిశువును గుర్తు తెలియని వ్యక్తులు వదిలివెళ్లారు. పుట్టిన గంటల వ్యవధిలోనే శిశువును రోడ్డుపై వదిలి వేయడంతో బిడ్డ ఏడుపు విన్న స్థానికులు వెళ్లి చూసి అక్కున చేర్చుకున్నారు. దొరబాబు యువసేన ప్రతినిధుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ వారా కుమారి ఘటన స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. స్థానికులు, పోలీసు సిబ్బంది సహకారంతో సర్పంచ్ కుమారి ఆ బిడ్డను స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.రామగురెడ్డి శిశువును పరీక్షించి ఆరోగ్యం మెరుగ్గానే ఉన్నట్లు చెప్పారు. వైద్యుల పర్యవేక్షణలో శిశువు ఆసుపత్రిలో ప్రాథమిక వైద్య సేవలు అందించారు. అనపర్తి ఎస్సై పి.అప్పారావు ఆ శిశువును పరీక్షించారు. దీనిపై ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించామని, పసికందు తల్లిదండ్రులు ఎవరన్న దానిపై విచారణ చేస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా శిశువు వైద్య సేవలకు అవసరమయ్యే ఖర్చును భరించేందుకు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కర్రి ధర్మారెడ్డి ముందుకు వచ్చారు.

ఎంత 'తల్లి'డిల్లేనో..

సాధారణంగా నవమాసాలు మోసి బిడ్డకు జన్మనిచ్చిన ఏ తల్లీ తన బిడ్డను రోడ్డు పాల్జేయాలని అనుకోదు. అయితే ఏదైనా చీకటి తప్పులకు గర్భం దాల్చిన సమయంలోనే ఇటువంటి ఘటనలు జరుగుతుంటాయని స్థానికులు భావిస్తున్నారు. ఆదివారం అనపర్తి పాతవూరులో చోటుచేసుకున్న ఈ ఘటనలో శిశువును రోడ్డున వదిలివేసింది సమీప ప్రాంతానికి చెందిన వారే అయి ఉంటారని ప్రజలు అనుకుంటున్నారు. దీనిపై పోలీసులు ఇప్పటికే ఆరా తీస్తున్నారు.


రోడ్డుపై మగ శిశువు


శిశివుకు వైద్య సేవలు అందిస్తున్న అనపర్తి ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది

రక్తదానం చేసి.. సేవ చాటి

- శ్రీయువసేన దశమ వార్షికోత్సవం
- పాల్గొన్న ఎంపీ గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కురసాల


సంకురాత్రి చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న సతీష్, ఎంపీ గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కురసాల

కాకినాడ క్రైం: కాకినాడలోని సూర్యకళా మందిర్‌లో ఆదివారం శ్రీయువసేన స్వచ్ఛంద సేవా సంస్థ దశమ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. దీనికి ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, కురసాల కన్నబాబు ముఖ్య అతిథులుగా హాజరుకాగా, పద్మశ్రీ అవార్డు గ్రహీత, సంకురాత్రి ఫౌండేషన్, శ్రీకిరణ్ కంటి ఆసుపత్రుల వ్యవస్థాపకుడు సంకురాత్రి చంద్రశేఖర్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. స్నేహితుల దినోత్సవం, దశమ వార్షికోత్సవంలో భాగంగా 306 మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడుతూ రక్తదాన కేంద్రంగా మొదలై సేవా సంస్థగా ఎదిగిన శ్రీయువసేన ప్రస్థానాన్ని కీర్తించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ చంద్రశేఖర్ వంటి ఆదర్శవంతుల స్ఫూర్తితో యువత సేవా మార్గం వైపు అడుగులు వేస్తుందన్నారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ యువత పెడతోవ పడుతుందంటూ జరుగుతున్న ప్రచారం సరికాదని, ఎందరో స్ఫూర్తివంతమైన మార్గాల్లో ప్రయాణిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ శ్రీయువసేన సంకల్పం గొప్పదని అభినందించారు. శ్రీయువసేన వ్యవస్థాపకుడు సతీష్ మాట్లాడుతూ రాజకీయాలు, వర్గ విబేధాలకు అతీతంగా శ్రీయువసేనకు ఆదరణ దక్కుతోందన్నారు. పలుమార్లు సహాయార్థులు తమను ఆశ్రయిస్తే తమ పరిధి దాటిన సేవకు నేరుగా ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి సహకారం ఎన్నోసార్లు లభించిందన్నారు. రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి అందించిన సహాయ సహకారాలు మరువలేనివన్నారు. శ్రీయువసేన మరింత మంది పేదలకు సహాయం అందించాలనే సంకల్పంతో ఏటా రూ.5 లక్షలు ఇవ్వాలని వీరభద్రారెడ్డి నిర్ణయించారని సతీష్ ప్రకటించారు.

సంస్కృతి పరిరక్షణకే ధర్మ ప్రచారం


సత్యదేవుని ప్రచార రథ యాత్రను ప్రారంభించిన మంత్రి సత్యనారాయణ, ఎమ్మెల్యే పర్వత, ఆలయ చైర్మన్ రోహిత్ తదితరులు


పండితులను సత్కరిస్తున్న మంత్రి సత్యనారాయణ, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ

- దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు
- రత్నగిరిపై అంబరాన్నంటిన ధర్మ ప్రచార సంబరం

అన్నవరం: మన సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకే రాష్ట్ర వ్యాప్తంగా ధర్మ ప్రచార మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. అన్నవరం వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ధర్మ ప్రచార మాసోత్సవాలకు ఆదివారం ఉదయం మంత్రి కొట్టు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ శ్రీకారం చుట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగలలో సత్యదేవుని సామూహిక వ్రతాలు నిర్వహించేందుకు సత్యదేవుని ప్రచార రథ యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగిస్తూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన నిర్విరామంగా కొనసాగాలని సత్యదేవుడిని కోరినట్లు తెలిపారు. ప్రధానంగా నేటి యువతకు సనాతన ధర్మం గురించి వివరించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ధర్మ ప్రచారంలో భాగంగా కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేసి వారికి తగిన పారితోషికం అందిస్తూ ఆదుకుంటామని మంత్రి వివరించారు. హిందూ ధర్మంపై పలువురితో ప్రవచనాలు చెప్పిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంకా ఏ విధంగా చేస్తే బాగుంటుందనే దానిపై పలువురు సలహాలు, సూచనలు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దేవదాయ, ధర్మదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ ప్రసంగిస్తూ ధర్మ ప్రచార మాసోత్సవాల పేరుతో ధర్మ ప్రచారం చేయడం చాలా మంచి కార్యక్రమమన్నారు. దీనిద్వారా హిందూ సంప్రదాయాలు, ఆచారాలు నేటి తరానికి తెలుస్తాయన్నారు.

రమణీయంగా శోభాయాత్ర

వందలాది మంది కళాకారుల ప్రదర్శనల నడుమ రత్నగిరి వినాయక అతిథి గృహం నుంచి సత్యదేవుని ఆలయం వరకూ నిర్వహించిన శోభాయాత్ర రమణీయంగా సాగింది. భరతనాట్యం, కూచిపూడి, ఇతర జానపద నృత్యాలను ప్రదర్శిస్తూ వందలాది మంది కళాకారులు, దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్ తదితరులు స్వామివారి ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ధర్మప్రచారం కార్యక్రమంలో భాగంగా నలుగురు పండితులను ఘనంగా సత్కరించారు. కడిమెల్ల వరప్రసాద్, దవేజీ తదితర పండితులను మంత్రి సత్యనారాయణ సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను బహూకరించారు.

పోలీస్ స్టేషన్‌లో వ్యక్తి అనుమానాస్పద మృతి


కడప రిమ్స్ మార్చురీలో కప్పా రాజు మృతదేహం

కడప అర్బన్: వైఎస్సార్ జిల్లా కడపలోని చిన్నచౌక్ పోలీస్ స్టేషన్‌లో కప్పా రాజు (45) అనే వ్యక్తి ఆదివారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసు అధికారుల ప్రకారం.. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలానికి చెందిన కప్పా రాజుకు ఆరు నెలల కిందట మద్యం మాన్పించేందుకు వైద్య సేవలు అందించారు. అతని మానసిక పరిస్థితి సరిగ్గా లేదు. ఈ నెల 2న తన గ్రామం నుంచి కడపకు వెల్డింగ్ పని చేసేందుకు వచ్చాడని అతని కుమార్తె పోలీసులకు సమాచారం ఇచ్చింది. కడపలో తిరుపతి, వాసుదేవరాజులు పిలిస్తే తన తండ్రి వచ్చాడని, రెండు రోజుల నుంచి ఆయన ఫోన్ పనిచేయలేదని తెలియజేసింది. ఈ నెల 5వ తేదీ అర్ధరాత్రి చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అశోక్‌నగర్‌లో ఎద్దుల బాబు అనే వ్యక్తి ఇంటి వద్దకు వెళ్లి రాజు గేటు తెరిచాడు. తరువాత ఆ ఇంటి ఆవరణలోని కూలర్ పగలగొట్టాడు. ఇంటివాళ్లు గమనించి యజమానికి ఫోన్ చేశారు. తరువాత జనం గుమిగూడి డయల్ 100కు అర్ధరాత్రి 1.20 గంటలకు ఫోన్ చేశారు. బ్లూకోల్ట్స్ 10కు సంబంధించిన పోలీసులు 1.26 గంటలకు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అతన్ని చిన్నచౌక్ పోలీసులకు అప్పగించారు. పోలీసు సిబ్బంది అతన్ని అదుపులోకి తీసుకున్నారు. రాజు తనది నెల్లూరని, మతిస్థిమితం లేని విధంగా ప్రవర్తించాడు. తరువాత అతనికి నీళ్లు ఇచ్చారు. రాత్రి పోలీస్ స్టేషన్‌లోనే రాజు నిద్రించాడు. లాకప్‌లో ఉన్న రాజు ఉదయం 8.51 గంటలకు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఈ విషయాన్ని 9.20 గంటలకు మహిళా కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్ గమనించారు. విధుల్లో ఉన్న సిబ్బంది వచ్చి రాజుకు సీపీఆర్ చేశారు. తరువాత వెంటనే ఆర్‌ఎంపీని పిలిచి ప్రథమ చికిత్స అందించారు. వెంటనే ఆటోలో కడప రిమ్స్‌కు తరలించారు. అప్పటికే రాజు మృతి చెందాడని రిమ్స్ వైద్యులు నిర్ధారించారు. అతని ప్యాకెట్‌లో దొరికిన ఐడీ, ఆధార్‌కార్డుల ఆధారంగా పోలీసులు అతని చిరునామాను గుర్తించారు. అతని కుమార్తె రాజేశ్వరికి సమాచారం ఇచ్చారు. అతని బంధువులు వచ్చిన తరువాత వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. సంఘటన స్థలాన్ని కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ పరిశీలించారు. కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్‌లో విధులను నిర్వహిస్తున్న సీఐ శ్రీరామశ్రీనివాసులు, ఎస్‌ఐ రవికుమార్, సిబ్బందిని విచారించారు. ఈ సంఘటనపై సమగ్రంగా విచారిస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ మార్చురీలో ఉంచారు.

పరమేశ్వరుని సేవలో సోదరీమణులు


పరమశివుడిని కల్యాణం చేసుకుంటున్న 19 మంది కన్యలు


ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: భగవంతుని సేవ చేస్తూ పది మందికి జ్ఞానాన్ని బోధించేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 19 మంది సిస్టర్లు ముందుకు వచ్చారు. ఆధ్యాత్మిక జీవితం ఆరంభించేందుకు ఈశ్వరునికి అంకితమయ్యారు. సర్వం విడిచి బ్రహ్మకుమారీస్‌గా ఆశ్రమంలో నూతన జీవితాన్ని చేపట్టేందుకు ఆ కన్యలు సర్పవరం జంక్షన్‌లోని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ కాకినాడ ఆధ్వర్యంలో సమర్పణ మహోత్సవంలో పాల్గొన్నారు. బ్రహ్మకుమారీస్ బెంగళూరు సబ్ జోన్ రాజయోగిని బీకే సుగంధ, కొప్పవరం ఆశ్రమం మాతాజీ ప్రభావతి, కాకినాడ సబ్ జోన్ ఇన్‌చార్జి రాజయోగిని బీకే రజని సమక్షంలో సిస్టర్లు తమ జీవితాలను సమర్పణ చేశారు. ముఖ్యఅతిథి సుగంధ దీదీ మాట్లాడుతూ ఎన్నో జన్మల పుణ్యఫలంగా 19 మంది కన్యలు ఈశ్వరునికి జీవితాన్ని అంకితం చేసుకుని జన్మను ధన్యం చేసుకున్నారన్నారు. కొప్పవరం ఆశ్రమం మాతాజీ ప్రభావతి మాట్లాడుతూ ఇలాంటి కారణజన్మ కోట్లలో కొంతమందికే లభిస్తుందన్నారు. పార్వతిగా అయి పరమేశ్వరుడిని కల్యాణం చేసుకున్నారన్నారు. కాకినాడ సబ్ జోన్ ఇన్‌చార్జి రజనీ దీదీ మాట్లాడారు. విశిష్ట అతిథి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మాట్లాడుతూ కన్యలు ఈశ్వరుని సేవల తరించేందుకు ముందుకు రావడం సాధారణ విషయం కాదన్నారు. ఈ కన్యల్లో అన్నపూర్ణ, చంద్రమ్మ, గాయత్రి, శ్రీదేవి, సుమ, శారద, తులసి, కమలాదేవి, కీర్తి, లక్ష్మీ, లలితాదేవి, విజయ, లలిత, వేద, విజయలక్ష్మి, ప్రసన్న, పుష్ప, శాంతి, రామలక్ష్మి ఉన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ


బీసీ ఉద్యోగుల సంఘ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కాకినాడ సిటీ: ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని బీసీ సంక్షేమ శాఖ, పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం కాకినాడ ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కాకినాడ జిల్లా, నగర బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానన్నారు. బీసీ ఉద్యోగులు ఉన్నత స్థానాలను అధిరోహించేందుకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నివిధాలా సహకారం అందిస్తున్నారని తెలిపారు. అనంతరం మంత్రి వేణుగోపాలకృష్ణ సమక్షంలో జిల్లా, నగర కార్యవర్గాల ప్రమాణ స్వీకారం జరిగింది. అంతకు ముందు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు రామానుజన్ శ్రీనివాస్‌రావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ తదితరులు ప్రసంగిస్తూ తక్షణమే కుల జనగణనను ప్రభుత్వం చేపట్టాలన్నారు. ఈబీసీ విధానాన్ని తీసుకువస్తే ముందుగా ఆర్థికంగా వెనుకబడిన కులాలు నష్టపోతాయని, అందువల్ల దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తొలుత మహాత్మా జ్యోతిబాఫులే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాకినాడ జిల్లా కమిటీ గౌరవ సలహాదారుడు దొమ్మేటి సుధాకర్, ప్రధాన కార్యదర్శి గంటి రాధాకృష్ణ, కోశాధికారి వాసంశెట్టి కామేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు చిందాడ ప్రదీప్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.